క్లుప్తంగా

బీసీ సంక్షేమమే లక్ష్యం



చెక్కులు అందిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: బీసీల అభ్యున్నతే బీఆర్‌ఎస్ సర్కారు ప్రధాన లక్ష్యమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ వృత్తులకు ఆర్థిక మద్దతు పథకంలో లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను బీసీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విడతల వారీగా త్వరలోనే కులవృత్తులపై ఆధారపడి జీవించే లబ్ధిదారులు అందరికీ చెక్కులు అందిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



కేటీఆర్‌కు సమస్యలు తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: మంత్రి కేటీఆర్‌ని విలీన గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు మంగళవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో కలిశారు. విలీన గ్రామాల సమస్యలతో పాటు, పెద్దూరు బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సిరిసిల్ల 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్–దీప

కోనరావుపేట: మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఫౌండేషన్ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు–డాక్టర్ దీప మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వచ్ఛమైన నీరు లభించక అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ఈ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకే గ్రామాల్లో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దండు ఎల్లవ్వ, సింగిల్‌విండో డైరెక్టర్ గొట్టె మహేశ్వరి, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



ప్రగతినగర్‌లో పంచముఖ వినాయకుడు



బీవైనగర్ చత్రసేన యూత్ అసోసియేషన్‌లో వినాయక జననం


వినాయక.. వైవిధ్య రూపాయ

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో వైవిధ్యమైన వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించారు. నిత్యపూజలు అందుకున్న వివిధ రూపాల్లోని పార్వతీ తనయుని ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, సిరిసిల్ల



గోపాలకృష్ణునితో గణేశుడు



అంబికనగర్‌లో యముడి రూపంలో..



మెహర్‌నగర్‌లో పరమశివుని రూపంలో..

వెల్లివిరిసిన మత సామరస్యం



కోనరావుపేట: కొలనూర్‌లో జెడ్పీ చైర్మన్ అరుణ



సిరిసిల్ల సుభాష్‌నగర్‌లో వ్రతాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. కార్మికక్షేత్రం సిరిసిల్ల వ్యాప్తంగా గణేశ్ మంటపాల్లో సామాజిక సేవలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముస్లింలు కూడా పాల్గొన్నారు. స్థానిక 19వ వార్డులోని సత్యానంద వినాయక సంఘంలో సీఎస్సీ హెల్త్‌కేర్, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా ఎస్పీ అఖిల్ మహాజన్, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పాల్గొన్నారు. గంభీరావుపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన చేశారు. వేములవాడ బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద నిర్వహించిన గణపతిహోమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని గణేశ్ మంటపాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, అన్నదానాలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మంటపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

– సిరిసిల్లటౌన్/వేములవాడ/గంభీరావుపేట/కోనరావుపేట/రుద్రంగి/చందుర్తి/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి



గంభీరావుపేట: లక్ష పుష్పార్చన



రుద్రంగిలో కుంకుమ పూజ



సిరిసిల్ల నిత్యాన్నదానంలో ముస్లింలు



వేములవాడ: గణపతి హోమం



సిరిసిల్లలో వైద్యశిబిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్

చాకలి ఐలమ్మకు నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోనరావుపేట మండలం సుద్దాలలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ ఆవిష్కరించారు. ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. రాష్ట్ర రజక సంఘం కార్యదర్శి బాలమల్లు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



గంభీరావుపేట: చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో నాయకులు



సిరిసిల్లటౌన్: జోహార్లు అర్పిస్తున్న బీజేపీ నాయకులు



కోనరావుపేట: సుద్దాలలో విగ్రహావిష్కరణ



వేములవాడరూరల్: మల్లారంలో..



సిరిసిల్ల: జోహార్లు అర్పిస్తున్న సిద్దం వేణు



తంగళ్లపల్లి: బస్వాపూర్‌లో..



ఎల్లారెడ్డిపేటలో..

నియామకం

గౌడ సంఘం కార్యవర్గం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా లింగాల నర్సయ్యను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా బొల్గం రాధాకృష్ణగౌడ్, కోశాధికారిగా పాముల నారాయణగౌడ్, కార్యవర్గసభ్యులుగా చింతల కిష్టయ్య, లింగాల యాదగిరి, మెరుగు గోవర్ధన్‌గౌడ్, బొల్గం వీరాగౌడ్, మోస్కంటి సుభాష్, జవ్వాజి శ్రీనివాస్, పందిర్ల రఘు ఎన్నికయ్యారు.

రాజన్నకు నాట్యనివేదన



వేములవాడ: సనాతన ధర్మాన్ని రక్షించుకునేందుకు చేపట్టిన కాశీ నుంచి కన్యాకుమారి యాత్రలో భాగంగా వేములవాడ రాజన్న సన్నిధిలో మంగళవారం కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు. ప్రఖ్యాత కూచిపూడి కళాకారుడు డాక్టర్ జీబీ నారాయణ శిష్య బృందం రుద్రాభిషేక మండపంలో నాట్య నివేదన సమర్పించారు. గతనెల 11న ప్రారంభమై అక్టోబర్ 12 వరకు 63 రోజులు 17వేల కిలోమీటర్లు వీరి యాత్ర కొనసాగనుంది.

మండల సభలో ప్రశ్నల వర్షం


- జీసీబంధు అమలుపై రచ్చ రచ్చ
- తంగళ్లపల్లి మండల సమావేశం

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులపై ప్రశ్నలవర్షం కురిపించారు. బీసీ బంధు లబ్ధిదారుల ఎంపికను సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియకుండా ఎంపిక చేయవద్దని ప్రజాప్రతినిధులు ఎంపీడీవో పి.లచ్చాలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బంధు లబ్ధిదారులను తామే ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీడీవో పి.లచ్చాలు, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, సింగిల్‌విండో చైర్మన్లు బండి దేవదాస్, కోడూరి భాస్కర్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, ఎంఈవో దూస రఘుపతి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస

నిరసనల హోరు



ఆశ కార్యకర్తల నిరసన ప్రదర్శన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం మంగళవారం నిరసనలతో దద్దరిల్లింది. ఓ వైపు ఆశకార్యకర్తలు, మరో వైపు అంగన్‌వాడీలు నిరసనలతో హోరెత్తించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రోడ్డుపైనే భోజనాలు చేసి నిరసన తెలిపారు. నెలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరుతూ ఆశకార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య ఉన్నారు.

రోడ్డుపైనే భోజనాలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రోడ్డెక్కారు. అంబేడ్కర్‌చౌరస్తాలో భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అందించిన మున్సిపల్ కౌన్సిలర్

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు జిల్లాలో అమలవుతున్న బస్‌లో భరోసా కార్యక్రమానికి గాను స్థానిక కౌన్సిలర్ రాజు మంగళవారం టౌన్ సీఐ ఉపేందర్‌కు కెమెరాలు అందించారు. కార్యక్రమంలో క్యాడం కృష్ణారెడ్డి, ఎర్రం మల్లయ్య, కొక్కుల నర్సయ్య, ఎర్రం మల్లయ్య, గడ్డం వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



టౌన్ సీఐ ఉపేందర్‌కు సీసీ కెమెరాలు అందిస్తున్న కౌన్సిలర్ రాజు

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీయం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో మహిళ సంఘాలతో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోషణ మాసంలో భాగంగా ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల కూరగాయాలు తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం డీహబ్ కో–ఆర్డినేటర్ రోజా, దేవిక, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరుకు ఎస్సారెస్పీ నీరు

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి మంగళవారం నీరు విడుదల చేశారు. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ మీదుగా 14,500 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో మిడ్‌మానేరుకు వస్తోందని అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి ఒక్క గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. మిడ్‌మానేరులో 24.59 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

సేవా రంగంలో ముందుండాలి

ఎల్లారెడ్డిపేట: సేవా రంగంలో విద్యార్థులు ముందుండాలని, సమాజం పట్ల అంకితభావంతో రాణించాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాములు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పొట్టకొడుతున్నారు

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి చెరువు నుంచి ఇరిగేషన్ అధికారులు కాలువను తీయడంతో నీళ్లతో పాటు చేపలు పోతున్నాయని గంగపుత్ర, మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

సారా ప్యాకెట్ల పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని గోపాల్‌పల్లెలో సారా విక్రయిస్తున్న భూక్య లావణ్య ఇంట్లో ఆరు లీటర్ల సారా ప్యాకెట్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. పక్క సమాచారం మేరకు గోపాల్‌పల్లె తండాలో సారా ప్యాకెట్ల విక్రయాలు జరుగుతున్నాయని తనిఖీలు చేపట్టామన్నారు. లావణ్య ఇంట్లో సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఏర్పాటు చేసిన ప్రతి ఒక్క గణపతిని ఈనెల 27న ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ తెలిపారు. గణనాథులను నిమజ్జనం చేసే రాచర్లబొప్పాపూర్ జక్కుల చెరువు, స్థానిక గిద్దె చెరువులను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. డీజేలతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, నేవూరి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి దేవరాజు పాల్గొన్నారు.



జక్కుల చెరువును పరిశీలిస్తున్న సీఐ,ఎస్సైలు

బోయినపల్లి: వినాయక నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక గ్రామంలో శాంతి సమావేశంలో మాట్లాడుతూ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అందుబాటులో ఉండి రహదారులు బాగు చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలు రాకుండా హెల్పర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. డీజేలు పెడితే చర్యలు తప్పవన్నారు. అంతకుముందు మండలంలోని విలాసాగర్, బోయినపల్లి, మాన్వాడ, మల్లాపూర్ తదితర గ్రామాల్లో ఎస్సై మామాడి మహేందర్ పర్యటించి నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు, యువకులకు సూచించారు.

రుద్రంగి: గణేశ్ నిమజ్జన వేడుకలు ఎలాంటి అల్లర్లు, గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై రాజేశ్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజే సౌండ్స్ పెట్టవద్దని, మద్యం మత్తులో అల్లర్లు, గొడవలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కులవృత్తులకు చేయూత

ఎల్లారెడ్డిపేట: కులవృత్తులకు బీసీబంధు చేయూత లాంటిదని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పిల్లి రేణుక పేర్కొన్నారు. మండల పరిషత్‌లో మంగళవారం బీసీబంధులో భాగంగా రెండో విడత 42 మంది లబ్ధిదారులకు అందించారు. ఎంపీడీవో చిరంజీవి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లోవోల్టేజీ పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట: విద్యుత్ లోవోల్టేజీ శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మండల సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలో విద్యుత్ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావుతో కలిసి భూమి పూజ చేశారు. ఎంపీటీసీ అనసూయ, ఏఎంసీ చైర్మన్ మోహన్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి, మహిళ మండల అధ్యక్షురాలు అఫ్సర ఉన్నీసా పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఎల్లారెడ్డిపేట: చిత్తూరు జిల్లాలోని యువతిపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితులను శిక్షించాలని మండల ఒడ్డెర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. యువతి కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. పాతబస్టాండ్‌లో యువతి ఆత్మశాంతించాలని కోరుతూ నివాళి అర్పించారు. శివరాత్రి లక్ష్మణ్, శివరాత్రి శ్రీనివాస్, శివరాత్రి శేఖర్, గోగుల రమేశ్, పిట్ల బాబు, యాపకాయల సంతోష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమ, నిబంధనలపై అవగాహన

రుద్రంగి: త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నియమ, నిబంధనలపై అన్ని పార్టీల నాయకులు అవగాహన కలిగి ఉండాలని రుద్రంగి ఎస్సై రాజేశ్ అన్నారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. రుద్రంగి తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో మాలోతు శంకర్, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.